

# మట్టి మనసు

వెంకటయ్యకి అర్థరాత్రి హఠాత్తుగా మెలకువొచ్చింది....

గుండెల్లో దడ...

రాక్షసి బల్లి లాంటి ఆకారమేదో... తన పొలంలో పనిచేస్తున్న కూలీల మీద పడి పంజా విసిరి గాయపరుస్తున్నట్టు... వాళ్ళు హాహాకారాలు చేస్తూ...

నెత్తురోడ్డుతుంటే... ఆకలి కడుపుల్ని చేతబట్టుకొని భయం భయంగా అరుస్తూ పరిగెడుతున్నట్టు.... చప్పున తెలివొచ్చింది.

దారుణమైన... పచ్చటి పొలాల్లో శవాలు... రక్తం కలిసిన బురద.... ఒళ్ళంతా చెమట పట్టింది... దిగ్గున లేచి కూచున్నాడు.

నిజానికి తన కల్లో కన్పించింది... తనింటికొచ్చి.... తనవైపే చూస్తూ మళ్ళీ పందిట్లో కొచ్చి కూచున్నట్టు.... అన్పించింది.

అదే....

అదే....

దెయ్యంలా.... కాముని భూతంలా... తేలు కత్తెర లాంటి కొమ్ములు కోరలు కలిగి... వెంకటయ్యకి కిటికీలోంచి దాన్ని చూడగానే ఒళ్ళు జలదరించింది.

మెల్లిగా లేచి బయటి లైటు వేశాడు.

కొడుకు, కోడలు పక్కగదిలో నిద్రపోతున్నారు. తన పక్కలో పడుకున్న మనవడికి దోమలు కుట్టకుండా దుప్పటి కప్పి.... తలుపు తీసి పందిట్లోకొచ్చాడు.

గుంభనంగా కూచుందది... దాని నోట్లోంచి వచ్చిన కత్తెర్లు పదును తేలి వున్నాయి.

ఎంతోమంది కూలీల్ని కొరికేసి... ఆయాసంతో నాలుకను మీసాలకు రాసుకుంటున్న పెద్దపులిలా... మన్ను తిన్న పాములా... కూచుంది. ఇంతలో వెనకగా ఏదో అలికిడి అవటంతో ఉలిక్కిపడి చూసాడు.

వెనక పెద్దకొడుకు నిల్చున్నాడు.

"ఏందే నాయినా... గీ ఒంటిగంట టైం లేసి కూసున్నావ్" అన్నాడు ఆదుర్దాగా.

తండ్రి మొహంలోని కలవరం అతడ్ని క్షణంపాటు కలవరపెట్టింది.

"పీడ కలలొస్తున్నాయ్ బిడ్డా... నిద్ర పడ్తలేదు... ఇది మీద పడి కొరుకుతున్నట్టనిపిస్తుంది." అన్నాడు ఆందోళనగా.

ఆ మాటకి కొడుకు నవ్వాడు.

"చిన్నపిల్లగాని లెక్క... గీ 'హార్వెస్టర్...' వరి కోసే మోటార్‌ని చూసి భయపడుడేందే" అన్నాడు.

"అదికాదు బిడ్డా... గిది కొన్నప్పట్నించి... నాకెందుకో మనసంత వడ్లు పెరుగుకలిపినట్లుంది బిడ్డా..." అన్నాడు బాధగా

"గదేందే నాయినా... గట్లనవడ్తివి. దాని పనితనం చూసి కూడా నీకర్థమైతలేదా? ఒక్క గంటల ఒక్క ఎకరం పొలాన్ని కోసి పెడ్తది. మన పొలాలన్నీ కోసినంక వూర్లె అందరికి కిరాయికియ్యొచ్చు. ఎకరాన పన్నెండువందలు... మంచిగా నడిపితే రోజు పది ఎకరాలు కోస్తది. పక్క వూరోల్లు కూడా కిరాయికి అడుగుతున్రు. మనూర్లె కైకిల్లోల్లకు ఎంత జాములచ్చినయ్... ఎకరాన పదిహేను వందలిస్తమన్నా... దొరుకుతున్రా...??" అన్నాడు.

"వూర్లె రైతులందరు పొలాల కొతలన్నీ ఒక్కసారే మొదలుపెడ్తే... కైకిల్లోల్లు కూడా ఏం చేస్తరు బిడ్డా?" అన్నాడు. "కైకిల్లోల్లు దొరికినా వరికోసుటానికి వారం

రోజులు పట్టె... బంతి కొట్టుటానికి రెండు రోజులు పట్టి.... గాలెప్పుడస్తదా తూర్పార పట్టడానికి అని పిట్టకు వెట్టినట్టు సూడాల్నాయె. ఈ హార్వెస్టర్ గా పనులన్నీ చెయ్యకనే కోత కోసి, నూర్చి గోనె సంచుల్లో పట్టుకునేటట్టు చెయ్యవట్టే...." అన్నాడు.

"బంతి కట్టినప్పుడు వరిగడ్డిని ఎడ్లు తొక్కుతాయ్ బిడ్డా... ఆ గడ్డి నమిలి తిన్నప్పుడు పశువులకు జెల్దిన జీర్ణమైతది. ఇది కోసిన గడ్డి ఎడ్లు తింటే... మన చిన్నోడు తినే బబుల్‌గమ్ లెక్క ఎంత నమిలినా ఏముండదు."

"అదిసరే.... దాని పనితనమేందో రేపు పొద్దుగాల్ల మన పొలం కోయంగా సూడు. నువ్వే మెచ్చుకుంటవ్ గనీ... ఇగ పడుకో" అన్నాడు.

"నిద్ర పడ్తలేదు బిడ్డా..." అంటూ వచ్చి మూలుగుతన్నాడు వెంకటయ్య.

*** **** ****

హార్వెస్టర్ ఏపుగా పెరిగిన పొలాన్ని చకచకా కోసేస్తోంది. దానికున్న కత్తెర్లతో పైరుని కత్తిరిస్తోంటే... డ్రైవర్ చాకచక్యంగా పొలంలో తిప్పుతున్నాడు.

బర్‌ర్‌ర్‌ర్.... గుయ్‌య్‌య్.... గుయ్‌య్‌య్... బర్‌ర్‌ర్‌ర్ దాని శబ్దం వెంకటయ్యలో కంపరం పుట్టిస్తోంది.

దాని శబ్దాల కింద పొలం కోసే నీరటి మైసమ్మ పాటవడి చితికిపోయినట్టనిపిస్తోంది.

"ఉల్లి పువ్వు మనసున్న సెందురుడా

నువ్వు ఉలికులికి పడకోయి సెందురుడా

నువ్వు కుమిలి కుమిలి ఏడ్వకోయి సెందురుడా"

మైసమ్మ పాటకి నడుం వంచి కొడవళ్లతో కోసే మిగతా వాళ్లంతా గొంతు కలిపితే...

చల్లగాలి పైరు మీద సాగిపోయేది.

పాటేకాదు... ఆ దృశ్యం ఎంత గొప్పది ?

పాట పాడని సమయాన... ఒకరింటి కష్టసుఖాలు ఒకరు, కొత్తగా పెళ్లయిన ఆడాళ్ళతో పరాచికాలు, రాధమ్మ మొగుడికి పట్టిన రోగానికి ఏం చేద్దామనుకునే చర్చలు, అన్నీ పనిలోనే...

హార్వెస్టర్ శబ్దానికి తెల్లకొంగలు చెదిరి పారిపోతున్నాయి... ఎండ్రిక్కాయిలు భయం, భయంగా గట్టు తొర్రల్లోంచి తొంగి చూస్తున్నాయి.

డ్రైవర్ దాన్ని ఆపు చేసి 'భోజనం చేసి వస్తా' నని పోయాడు.

చద్ది గిన్నెల దగ్గర ఎన్ని ముచ్చట్లోచ్చేవి. నర్సవ్వ చింతకాయ తొక్కు తెచ్చిందంటే ఒకళ్ళ మీద ఒకళ్లు ఎంతగా ఎగబడేవాళ్లు... ఒకల చద్ది గిన్నెల్లోంచి ఒకల్లు కూరలేసుకుంటూ... పొలమంతా గలగలా శబ్దాలతో నవ్వుల్తో పండిపోయేది.

లింగవ్వ బిడ్డ పెళ్ళికి తులం బంగారం తక్కువైతే... తలా ఇంత డబ్బులేసుకున్నది ఈ పొలంలేనే...

రాధమ్మ మొగుడికొచ్చిన రోగాన్ని తగ్గించడానికి సాయం చేసుకుంది ఈ పొలంలోనే... దుబాయ్‌ల గంగమ్మ మొగుడు చచ్చిపోయిండనే వార్త వస్తే...

అంతా ఓదార్చింది ఈ పొలంలోనే...

"ఈ పొలాన్ని జూస్తే కొయ్య బుద్దయితలేదు, గంత మంచిగ పెరిగింది పటేలా?" అని ప్రేమను పెంచుకుంది ఈ పొలంపైనే.

గట్టుమీద కూచోబెట్టిన శాంతమ్మ కొడుకు గుక్కబెట్టి ఏడిస్తే... నువ్వు పాలియ్యి. నీవంతు కోసిపెడ్తామనే ఆప్యాయతల్ని పంచుకుంది ఈ పొలంలోనే. వాటన్నింటిని ఈ యంత్రభూతం తొక్కేస్తుంది.... పీల్చి పిప్పి చేస్తుంది.... ఇంకా ఆ నవ్వులు... గలగలలు... పరాచికాలు... సాయాలు.... ఓదార్పులు... ఏవీ విన్పించవు.

పైరుతో పాటు హార్వెస్టర్ వాటిని సైతం తన కత్తెర్లతో కోసేసింది. పాటల కుత్తుకల్ని కత్తిరించింది.

వెంకటయ్య గుండె బరువుగా అయింది. ఆ దృశ్యాన్ని చూస్తూ ఇంకా తాను భరించలేమోనని అనుకొని... మళ్లీ ఆ దయ్యాం కలలో కొస్తుందేమోనన్న భయంతో అదే వూర్లో వేరుపడి వున్న చిన్న కొడుకు ఇంటికిపోయాడు.

*** **** ****

చిన్న కొడుకింట్లో భోజనాల దగ్గర....

"నాయినా.... పెద్దన్న హార్వెస్టర్ మంచిగ నడుస్తుందే... చుట్టు పక్కల వూరోల్లకు కూడా కిరాయికిస్తుండు. అది తెచ్చి వారం తిరగక ముందే అన్న బాగానే సంపాయించిండట... వూర్లె అనుకుంటుండ్రు..." అన్నాడు చిన్న కొడుకు రాజేశం.

వెంకటయ్య ఏమీ మాట్లాడలేదు.

"నాక్కూడా బ్యాంకు వాళ్ళు 'లోన్' ఇచ్చిండ్రు... నేను కూడా ఇయ్యాల్నే జగిత్యాల పోయి తీసుకొస్తున్న...."

వెంకటయ్య నిశ్శబ్దంగా కొడుకు మొహంలోకి చూసాడు.

"కాని... నేను తెచ్చేది అన్నయ్యలాగా హార్వెస్టర్ కాదు..." అని చెప్పాడు.

"మరేంటిదిరా.....?"

"రైస్ ట్రాన్స్‌ప్లాంటర్".

"అంటే....?"

"నాట్లు పెట్టే యంత్రం."

వెంకటయ్యకి చివుక్కుమంది... పాలమారింది. నాట్లు పెట్టే దృశ్యం గుర్తొస్తే చాలు... భార్య గుర్తొస్తుంది!!

ముప్పయేళ్ల కింద పక్క వూర్లో పనిబడి.... పొలం గట్ల వెంబడి పోతున్నప్పుడు...

నాట్లు పెడుతున్న వాళ్ల పాట వింటూ నిల్చిపోయాడు.

'చిమ్మ చీకట్లో సెందురుడు పూసిండు
నువ్వేడ పోతివిరా నా పాలికాపోడా...
సుద్దబాయి కాడ నీ సుద్ద దీస్తుంటే
సద్దితిన్నట్టాయే... ముద్దులిచ్చినట్టాయే...'

వంగి నాట్లు పెడుతూ... పాడుతున్నావిడ బడలికగా అప్పుడే లేచి నిల్చుంది. ఆమె అందం చూసి ఆశ్చర్యపోయాడు. ఆ తర్వాత కులం ఒకటే అని తెలిసాక... పెద్దలతో సంప్రదించి 'రత్నవ్వ' ని పెండ్లి చేసుకున్నాడు. అందుకే నాట్లు పెట్టే దృశ్యమంటే.... వెంకటయ్యకి ప్రాణం....

అప్రయత్నంగా.... పళ్లెంలో చేయి కడుక్కుని లేచాడు.

"గదేందే... కూర మంచిగ లేదా?" అని కొడుకు అడిగినా విన్పించుకోకుండా బయటికెళ్లాడు.

*** **** ****

"నాయినా... దాని ముందు కొబ్బరికాయ నువ్వే కొట్టాలి... రాయే" అన్నాడు రాజేశం. వెంకటయ్య ఇంట్లోంచి వాకిట్లోకి వచ్చి... దాన్ని చూసి నిశ్చలమైపోయాడు.

హార్వెస్టరంత పెద్దగా లేకపోయినా.... పిల్ల దెయ్యం లాగుందది.

రాజేశం భార్య, పిల్లలు దాన్ని చూసి మహదానందపడిపోతున్నారు. కోడలు దాన్ని చూడటానికొచ్చిన కూలీలకు చిలువలు, పలవలుగా వర్ణించి చెప్తోంది.

దానికి కొబ్బరికాయ కొట్టి.... హారతిని పట్టటం వెంకటయ్యకిష్టం లేదు.

"కోడలితో కొట్టించరా" అన్నాడు అన్యమనస్కంగా.

"లేదే నాయినా... నువ్వే కొట్టాలి" అని బలవంతంగా దానికి పసుపుకుంకుమ పెట్టించి.... జీడిగింజ, నిమ్మకాయ, ఎండు మిరపకాయ కట్టించి.... కొబ్బరికాయ కొట్టించాడు. కోడలు హారతి పట్టింది.

వెంకటయ్య ముందురోజు వెళ్లకూడదనుకున్నా... అదెలా నాట్లు వేస్తుందో చూడాలని వెళ్లాడు.

బురదలో అందంగా మెరుస్తోందది.

బురదంటితేనే పులకించిపోయే తనకి... రైస్ ట్రాన్స్‌ప్లాంటర్‌ని చూడగానే శరీరం జలదరించింది. ఆపరేటర్ దాన్ని నడుపుతుంటే... వరి మొలకల్ని సమాన దూరంలో నాటుతోంది. వరి నాటుతూ పాడే... 'కొండ మల్లె పువ్వా సెల్లెలా.. మరిది ఊసులేనా సెల్లెలా... మా మీద దయుంచే సెల్లెలా...' పాట ముక్కలవుతోంది.

రైస్ ట్రాన్స్‌ప్లాంటర్... చిత్రమైన శబ్దంతో పొలమంతా ఆక్రమించుకుంటోంది. దాని శబ్దానికి ఓ బురద పాము తల్లడిల్లిపోతూ కెనాల్ వైపు పరిగెత్తింది. తుమ్మ చెట్ల మీదున్న పిట్టలన్నీ తుర్రున ఎగిరిపోయాయి. గట్టున మేస్తున్న లేగదూడ ఊర్లోకి ఉరికింది.

వెంకటయ్యకి ఎటుపోవాలో అర్థం కాలేదు.

నీరసంగా చిన్నకొడుకు ఇంటికి వచ్చాక ఓ నిర్ణయం తీసుకున్నాడు.

అది కొద్దిరోజులు..... కరీంనగర్‌లో సెటిలైన కూతురింటికి వెళ్లాలని !! తన బాధంత ఏడో తరగతి చదువుతున్న మనవడికి చెప్పాడు. అందుకు మనవడు నవ్వాడు.

నవ్వి "తాత... నువ్వు పెద్ద కొడుకింట్లో హార్వెస్టర్ దయ్యముందనీ, చిన్న కొడుకింట్లో రైస్ ట్రాన్స్‌ప్లాంటర్ భూతముందని బెదిరి కూతురింటికిపోయినా... అక్కడ ఇంతకన్నా దారుణమైన ఇలాంటి ఆక్టోపస్ వుంది..." అన్నాడు

భయపెట్టినట్లుగా.

ఏ ఆక్టోపస్ రా ? అదేలావుంటుంది... నన్ను భయపెట్టడానికి కాకపోతే..." అన్నాడు.

మనవడు గంభీరంగా... "వాళ్లింట్లో వున్న ఆక్టోపస్ గురించి నీకు తెలీదు. అది మాటల్ని సైతం మింగేసి మూగవాళ్లని చేస్తుంది.... తలుపులు, కిటికీలు అన్నీ మూసుకున్నా అది ఇంట్లోకి వచ్చేస్తోంది. అక్కడందంగా దాన్ని గుడ్లప్పగించి చూస్తుంటే... ఒంటరిగా నీకు పిచ్చెక్కిపోవటం ఖాయం"

"ఛ... నోర్మూసుకోరా మనవడా" అన్నాడు చిరాకంగా.

"నిజం తాతయ్యా.... ఆ ఆక్టోపస్ పేరు... టెలివిజన్" అన్నాడు టీ.వీ. పేరు వినగానే... మనవడు చెప్పిన విషయాలు ఓసారి బిడ్డ ఇంట్లో అనుభవంలోకి వచ్చిన పరిస్థితి గుర్తొచ్చింది.

వెంకటయ్య మనసు చిన్నబోయింది. కోడలు పళ్లెంలో అన్నం, కూరా తెచ్చి పెట్టినా తినాలన్పించలేదు.

మనిషి... మట్టి మనిషైనా సర్దుకుపోతాడేమో

మరి మనసే... మట్టి మనసైతే... అది యంత్రపు కోరల్లో చిక్కి, నలిగిపోతుంది. వెంకటయ్య పరిస్థితి అలాగే వుంది. బయటెవరో చిన్న వయసు బిచ్చగాడు "అవ్వా... బువ్వెయ్యి... అవ్వా.... బుక్కెడు బువ్వెయ్యి...." అని అరుస్తున్నాడు.

కోడలు వాణ్ణి కసురుకుంటున్నా వెళ్లటంలేదు.

"ఎవడమ్మా.... బిచ్చగాడా...?" అనడిగాడు వెంకటయ్య.

"బిచ్చగాడు కాదు మామా.... మనకు కైకిలి రాకపోవునా... నీరటి మైసమ్మ.... దాని కొడుకు... నీకేం పోయే కాలం రా... అడుక్కుంటున్నవ్... అని ఛీత్కారంగా కసురుకుంటుంది.

తమ పొలాల్లో కోతలకొచ్చే మైసమ్మ....

తమ పొలాల్లో వంచిన నడుం ఎత్తకుండా పొద్దంతా నాట్లు పెట్టే మైసమ్మ... దాని కొడుకు బిచ్చమడుక్కుంటున్నాడా?

వెంకటయ్య పళ్లెంతో పరిగెత్తుకొచ్చాడు.

బయట ఆరేళ్ల కుర్రాడు... సొట్టబోయిన పల్లెంతో... దీనమైన చూపుల్తో....

"అయ్యా... బువ్వెయ్యి... బాంచెన్.... అవ్వకు పని దొరుకుత లేదు... ఆకలైతంది... అయ్యా.... బుక్కెడంత బువ్వెయి...."

వెంకటయ్య మట్టి మనసు కన్నీరైంది.

కళ్ళు బురద గుంటలయ్యాయి.

వాణ్ణి దగ్గర తీసుకొని... ఒళ్లో కూచోబెట్టుకొని నోట్లో ముద్దపెట్టాడు.

అప్పటికే... ఆ దృశ్యానికి నోరు తెరిచిన కోడలు భర్తని పిలుచుకొచ్చింది. "కొడుకులు బాగా ఎదిగి పొలంలో తిరిగే మోటార్లు కొంటున్నారని... మీ అయ్యకి ఎవడో మంత్రం చేసినట్లున్నడు... లేకపోతే గీ పిచ్చితనం ఏంది...." అంటోంది.

వెంకటయ్యకి అవేవీ విన్పించటం లేదు. చెరువుకట్ట మీంచి వలసపోతున్న కూలీల దృశ్యమే కదలాడుతోంది.